సాక్షి అనకాపల్లి

బుధవారం । 13 । డిసెంబర్ । 2023



అనంత కాంతులు 8లో

అనంత పద్మనాభస్వామి దీపోత్సవం దేదీప్య మానంగా జరిగింది. ఆధ్యాత్మిక కాంతులు వెదజల్లి భక్తులను పరవశులను చేసింది.



అలరించిన నాటికలు

విశాఖ: జాతీయ భాషా నాటకోత్సవాల్లో భాగంగా కళాభారతిలో ప్రదర్శించిన గారడీ, బాంబే టైలర్స్ నాటకాలు అలరించాయి.

వాతావరణం

అనకాపల్లిటౌన్: రాగల ఐదు రోజులు వాతావరణం పొడిగా ఉంటుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు 29.06 నుంచి 30.2 డిగ్రీలు, గాలిలో తేమ 68–75 శాతం, గాలి గంటకు 3–4 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందన్నారు.

న్యూస్‌రీల్

డీఎస్పీ మహేష్‌కు అస్వస్థత

- విధుల్లో ఉండగా గుండెనొప్పి రావడంతో హుటాహుటిన ఆస్పత్రికి..
- గుండెకు స్టంట్ వేయడంతో తప్పిన ప్రమాదం

బుచ్చెయ్యపేట: అనకాపల్లి దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ మళ్ల మహేష్ అస్వస్థతకు గురయ్యారు. సామాజిక సాధికార బస్సుయాత్ర విధులకు వచ్చిన ఆయన మంగళవారం సాయంత్రం వడ్డాది కోవెల అప్పనదొర హైస్కూల్ గ్రౌండ్‌లో బహిరంగ వేదిక వద్ద విధులు నిర్వహిస్తుండగా గుండెనొప్పి వచ్చింది. అక్కడే ఉన్న కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్, బుచ్చెయ్యపేట ఎస్‌ఐ కె.కుమారస్వామి తమ సిబ్బందితో వెంటనే ఆయన్ని వాహనంలో ఆసుపత్రికి తరలించారు. విశాఖ కిమ్స్ ఆసుపత్రిలో ఆయనకు వెంటనే వైద్య సేవలు అందించి గుండెకు స్టంట్ వేయడంతో ప్రాణాపాయం తప్పిందని ఎస్‌ఐ తెలిపారు.

సీఎంఆర్ విరాళం

- ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల సహాయార్థం రూ.4.80 లక్షల అందజేత



కలెక్టర్ మల్లికార్జునకు చెక్కు అందజేస్తున్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ

మహారాణిపేట : జిల్లాలోని ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కోసం సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ రూ.4.80 లక్షల చెక్కును కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో అందజేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ నిధులను అందజేసినట్టు ఆయన తెలిపారు. జిల్లాలోని ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఈ నిధులు ఉపయోగించాలని, అవసరమైతే మరిన్ని నిధులు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.

సురక్షిత ప్రయాణానికి చర్యలు

- ఆర్టీసీ జోనల్ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ నాయుడు



డిపో ఖాళీ స్థలం రికార్డులను పరిశీలిస్తున్న ఆర్టీసీ, రెవెన్యూ అధికారులు

నర్సీపట్నం: ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణానికి చర్యలు తీసుకుంటున్నామని జోనల్ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.ఎ.నాయుడు తెలిపారు. లీజుకు ఇచ్చిన నర్సీపట్నం ఆర్టీసీ డిపో స్థలాన్ని జిల్లా ప్రజారవాణా అధికారి పద్మావతితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఆల్కహాల్ టెస్టులను సమర్థంగా నిర్వహిస్తున్నామన్నారు. జోనల్ పరిధిలో పది విడతలుగా 500 మంది డ్రైవర్లకు డ్రైవింగ్ మెలకువలపై శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. అనంతరం జిల్లా ప్రజారవాణా అధికారి పద్మావతి మాట్లాడుతూ కార్తీక మాసంలో జిల్లా నుంచి ప్రత్యేక బస్సులు నడపడం ద్వారా రూ.7.50 లక్షల ఆదాయం లభించిందని తెలిపారు. సరుకు రవాణాలో రాష్ట్రంలో జిల్లా రెండవ స్థానంలో ఉందన్నారు.

సామాజిక ప్రభంజనం

విపక్షాల మూకుమ్మడి కుట్రలు.. పచ్చ పత్రికల అసత్య ప్రచారాలు ఇవేవీ సీఎం జగన్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని లేశమాత్రమైనా తగ్గించలేకపోతున్నాయి. ప్రధాన ప్రతిపక్షం టీడీపీ భవిష్యత్ నాయకుడని జాకీలెత్తుతున్న లోకేష్ పాదయాత్ర సమయంలోనే జిల్లాలో ప్రజాసాధికార బస్సు యాత్ర మూడో విడత మొదలయింది. లోకేష్ యాత్రవేపు జనాలు కన్నెత్తి చూసేందుకు సాహసించలేదు. బస్సు యాత్రకు మాత్రం అడుగడుగునా జన నీరాజనం దక్కింది. సీఎం జగన్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ లబ్ధి జనాల్లో ఎంతగా అభిమానాన్ని పెంచిందో.. ఈ యాత్రకు వస్తున్న స్పందన స్పష్టం చేస్తోంది.

వడ్డాదిలో జరిగిన సామాజిక సాధికార సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం.. సభలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, వేదికపై ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, మంత్రులు కారుమూరి, అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎంపీలు సత్యవతి, నందిగాం సురేష్





అభిమాన తరంగం

- బస్సు యాత్రకు అడుగడుగునా జన నీరాజనం
- ఐదు వేల బైక్‌లతో ఊరూరా హోరెత్తించారు
- మిన్నంటిన జై జగన్.. జైజై జగన్ నినాదాలు



కొత్తకోట హైస్కూల్‌లో విద్యార్థినులతో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి



హోరెత్తిన బైక్ ర్యాలీ



సభా వేదిక వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళి

చోడవరం: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ అమలు చేస్తున్న కార్యక్రమాలకు జనం జేజేలు పలికారు. ఆడా మగ, చిన్నా పెద్ద అన్న తేడా లేకుండా జనమంతా ప్రభంజనమై రెట్టించిన ఉత్సాహంతో ప్రజా సాధికార బస్సుయాత్రలో పాల్గొన్నారు. చోడవరం నియోజకవర్గంలో మంగళవారం జరిగిన బస్సు యాత్రకు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. ఈ బస్సు యాత్ర వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వాటిని ఆయా వర్గాలకు వివరించేందుకు ప్రభుత్వం మంత్రులు, ఎమ్మెల్యేలతో బస్సుయాత్రకు శ్రీకారం చుట్టింది. మూడో విడత యాత్ర చోడవరం నియోజకవర్గంలోని వెలంకాయలపాలెంలో ప్రారంభమైంది. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో జరిగిన బస్సుయాత్రలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఇన్‌చార్జి మంత్రి పీడిక రాజన్నదొర, మంత్రులు ధర్మాన ప్రసాద్, గుడివాడ అమర్‌నాథ్, ఎంపీలు నందిగాం సురేష్, బీవీ సత్యవతి, ఎమ్మెల్యేలు అదీప్‌రాజ్, గొల్ల బాబూరావు, తిప్పల నాగిరెడ్డి, పెట్ల ఉమాశంకర్ గణేష్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణికి ప్రజలు అశేష మద్దతు తెలిపారు. తొలుత రోలుగుంట హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం ప్రారంభమైన బస్సు యాత్ర కొత్తకోట, రావికమతం, అర్జాపురం, దొండపూడి, కోమళ్లపూడి, ఎల్.సింగవరం, బంగారుమెట్ట మీదుగా వడ్డాది హైస్కూల్ గ్రౌండ్ వరకూ సాగింది. దారి పొడవునా మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు.

- బస్సుకు ముందు సుమారు 5 వేల మోటారు సైకిళ్లతో కార్యకర్తల కేరింతల మధ్య బైక్ ర్యాలీ జోష్ నింపింది. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, చిటికెల భజనలు, మహిళల కోలాటాలు, తీన్‌మార్ డప్పులు, థింసా నృత్యాలతో ఊరూరా సందడి నెలకొంది.
- కొత్తకోట జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి అక్కడి మౌలిక సదుపాయాలు, నాడు–నేడు పనులను పరిశీలించి, విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగన్ మామయ్య వల్ల తామంతా అన్ని సౌకర్యాలతో బాగా చదువుకుంటున్నామని విద్యార్థులంతా ముక్త కంఠంతో చెప్పారు. పాఠశాలలో ఇతర సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని బస్సుయాత్రలో వచ్చిన మంత్రులు హామీ ఇచ్చారు.
- చీమలపాడు పంచాయతీ జంక్షన్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్టలో రూ.55 లక్షలతో నిర్మించిన ఇంటింటి కొళాయిలను మంత్రులు ప్రారంభించారు.
- వడ్డాది హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. నేల ఈనిందా అన్నట్టుగా సభా ప్రాంగణమంతా జనంతో నిండిపోయింది. జై జగన్.. జైజై జగన్ నినాదాలతో సభా ప్రాంగణం హోరెత్తిపోయింది. జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ యువకులు, మహిళలు మిన్నంటేలా నినదించారు.
- సభ ప్రారంభానికి ముందు చిన్నారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



కొత్తకోట గ్రామానికి చెందిన చిత్రాడ అయ్యప్ప అభిమానాన్ని ఇలా చాటుకున్నాడు. తల ఒకపక్క కత్తిరించుకుని సీఎం జగన్ పేరుతోపాటు పార్టీ జెండా రంగులు వేసుకొని ఆకట్టుకున్నాడు. -రావికమతం

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, పార్టీ సీనియర్ నాయకుడు చొక్కాకుల వెంకట్రావు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు వీసం రామకృష్ణ, రామన్నపాత్రుడు, టీవీ రమణ, జెడ్పీటీసీలు పోతల లక్ష్మీప్రసాద్, తలారి రమణమ్మ ఆదిమూర్తి, దొండా రాంబాబు, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, పైల రాజు, దాకవరపు నాగేశ్వరీదేవి, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక సంబరం

అన్ని వర్గాల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

చోడవరం: బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా మంగళవారం రోలుగుంటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని టీడీపీ ప్రభుత్వం రూ.150 కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టేస్తే, సీఎం జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో రూ.90 కోట్ల అప్పును తీర్చినట్లు తెలిపారు. నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి రూ.970 కోట్లు, మరో రూ.900 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. జగనన్న కాలనీల ద్వారా 4,690 మంది పేదలకు పక్కా ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. రూ.68 కోట్లతో గ్రామాలకు లింకు రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరించిన ఒక కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే రూ.112 కోట్లతో మంజూరైన బీఎన్ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయని మండిపడ్డారు. ఈ రోడ్డును కూడా త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ సామాజిక సాధికారత వైఎస్సార్‌సీపీ నినాదమన్నారు. వెనుకబడిన వర్గాలను పైకి తీసుకురావాలన్నదే సీఎం జగన్ ఆశయమన్నారు. ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి మాట్లాడుతూ కులాలు, పార్టీలు చూడకుండా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీయేనని కొనియాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అన్నింటా సముచిత స్థానం కల్పించడం వల్లే బీసీ మహిళ అయిన తాను ఎంపీ అయ్యానని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు ఉమాశంకర్ గణేష్, తిప్పల నాగిరెడ్డి, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకట్రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, పక్కన వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే ఉమాశంకర గణేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ



బంగారుమెట్టలో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా కుళాయిని ప్రారంభిస్తున్న విప్ ధర్మశ్రీ

మార్గశిర మాసోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

మహారాణిపేట: శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో బుధవారం నుంచి జరగనున్న మార్గశిర మాసోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జేసీ, సమన్వయ కమిటీ చైర్మన్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. సమన్వయ కమిటీ సమావేశం జేసీ అధ్యక్షతన మంగళవారం సాయంత్రం దేవస్థానం సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. వీఐపీలు, సాధారణ భక్తులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. తాగునీరు, పారిశుధ్యం, వైద్య శిబిరాలు, విద్యుత్, తదితర అంశాలపై సంబంధిత శాఖాధికారులతో జేసీ సమీక్షించి పలు సూచనలు చేశారు. తాత్కాలిక పోలీసు ఠాణా, బందోబస్తును అందుబాటులో ఉంచనున్నట్టు పోలీసు అధికారులు తెలిపారు. ఆలయ పరిసరాలతో పాటు వీధుల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ, తరలించేందుకు అవసరమైన డస్ట్ బిన్లను ఏర్పాటు చేశామని జీవీఎంసీ అధికారులు తెలిపారు. తాత్కాలిక మరుగుదొడ్లను అవసరమైన ప్రదేశాలలో ఏర్పాటు చేశామన్నారు. అగ్నిమాపక శకటంతో పాటు ముఖ్య ప్రదేశాల్లో మంటలు ఆర్పే యంత్రాలను సిద్ధం చేశామని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ అధికారులు వివరించారు. ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిని జేసీ ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించామని ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో మత్తు పానీయాల విక్రయాలు, వినియోగం లేకుండా సంచార బృందాలను ఏర్పాటు చేసి, నిఘా పెట్టాలని అబ్కారీ శాఖాధికారులకు జేసీ సూచించారు. ఈ సమావేశంలో ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిహెచ్.వెంకటరమణ, జీవీఎంసీ అదనపు కమిషనర్ వై.శ్రీనివాస్, జోనల్ కమిషనర్ శివప్రసాద్, ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సభ్యులు, పోలీసు, జీవీఎంసీ, రెవెన్యూ, దేవదాయ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సర్వాంగ సుందరంగా అలంకరించిన కనక మహాలక్ష్మి ఆలయ ప్రాంగణం

ఏర్పాట్లు పరిశీలన

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాలను బుధవారం ఉదయం 8.01 గంటలకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఉత్సవాల ఏర్పాట్లను జేసీ విశ్వనాథన్ ఆలయ ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలంతో కలిసి పరిశీలించి, పలు సూచనలు చేశారు. ముందుగా అమ్మవారిని జేసీ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సింహగిరిపై 17 నుంచి ధనుర్మాసోత్సవాలు



సింహాద్రి అప్పన్న, గోదాదేవి

సింహాచలం: సింహగిరిపై ఈ నెల 17 నుంచి ధనుర్మాసోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి మంగళవారం తెలిపారు. అలాగే సింహగిరిపై ఈ నెలతో పాటు వచ్చే జనవరిలో జరిగే పలు విశేష ఉత్సవాలకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ నెల 17న ధనుర్మాస పూజలు ప్రారంభమవుతాయని, ఆ రోజు తెల్లవారుజామున సింహగిరిపై రాజగోపురంలో నెలగంట మోగించనున్నట్టు పేర్కొన్నారు. అప్పన్న స్వామికి, గోదాదేవికి విశేష పూజలు, తిరువీధి నిర్వహిస్తామన్నారు.

- ఆలయంలో ఈ నెల 13 నుంచి 22 వరకు పగల్‌పత్తు ఉత్సవాలు జరుగుతాయన్నారు. రోజూ ఉదయం స్వామివారికి తిరువీధి ఉత్సవం జరుపుతామని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆర్జిత సేవలను రద్దు చేశామన్నారు.
- ఈ నెల 23 నుంచి జనవరి 2వ తేదీ వరకు ఆలయంలో రాపత్తు ఉత్సవాలు నిర్వహిస్తారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా వరుదు కల్యాణి



వరుదు కల్యాణి | కొండా రాజీవ్ | రొంగల నారాయణమ్మ

దొండపర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఎమ్మెల్సీ వరుదు కల్యాణి నియమితులయ్యారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలు రాష్ట్ర కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ప్రకటించింది. ఇందులో రాష్ట్ర మహిళా విభాగం కమిటీలో విశాఖ జిల్లా నుంచి తొమ్మిది మందికి చోటు కల్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా మంతెన మాధవీవర్మ, జోనల్ ఇన్‌చార్జ్‌లుగా బి.పద్మావతి, పీలా వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా మళ్ల దేవీ విశాలాక్షి, పెనుమత్స శ్రీదేవివర్మ, కార్యదర్శి ముదుండి రాజేశ్వరి, సంయుక్త కార్యదర్శులుగా నీలాపు లక్ష్మి, కొనల విజయ వినీతలను నియమించారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కోరబ్ అనూషదేవిని రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా నియమితులయ్యారు. అనకాపల్లి జిల్లాకు చెందిన రొంగల నారాయణమ్మను రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమించారు.

రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా కొండా రాజీవ్

రాష్ట్ర యువజన విభాగ కమిటీలో విశాఖ నుంచి నలుగురికి ప్రాతినిధ్యం కల్పించారు. రాష్ట్ర యువజన విభాగ కమిటీ ఉపాధ్యక్షుడిగా కొండా రాజీవ్‌గాంధీ, జోన్–2 జోనల్ ఇన్‌చార్జిగా ముత్తంశెట్టి వెంకట శివసాయి నందీష్, కార్యదర్శిగా అంబటి నాగ వినాయక శైలేష్, సంయుక్త కార్యదర్శిగా కండిపల్లి సతీష్‌కుమార్ నియమితులయ్యారు.

అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి రాష్ట్ర యువజన విభాగ కమిటీ ప్రధాన కార్యదర్శిగా చెట్టి వినయ్, కార్యదర్శిగా చిక్కుడు చిన్నారావులను నియమించారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టుల నోటిఫికేషన్ రద్దు


సీడీపీవో మేరీ సువార్త

నర్సీపట్నం: నర్సీపట్నం ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు ఇటీవల జారీ చేసిన నోటిఫికేషన్ రద్దు చేయడం జరిగిందని ఐసీడీఎస్ సీడీపీవో మేరీ సువార్త తెలిపారు. నర్సీపట్నం, మాకవరపాలెం మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు 3, సహాయకురాలు-1, మినీ కార్యకర్త -1 పోస్టుకు నోటిఫికేషన్ ఇచ్చి, ఈ నెల 4వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. కె.తాడపాల, బంగారయ్యపేట, మొండికండి, బలిఘట్టం, పైడిపాల ఒసీకి కేటాయించిన పోస్టుల నోటిఫికేషన్‌ను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రద్దు చేయడం జరిగిందన్నారు. తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటిఫికేషన్ ఇస్తామన్నారు.

చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న రవి భూమిజీ

పాయకరావుపేట : కేశవరం గ్రామం వద్ద గల హరిహరన్ కంపెనీలో కార్పెంటరుగా పనిచేస్తున్న రవి భూమిజీ (28) అనే వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఏఎస్‌ఐ గోవిందు తెలిపారు. వివరాలివి. పశ్చిమబెంగాల్‌కు చెందిన రవి భూమిజీకి ఏడాది క్రితం వివాహం జరిగింది. మద్యానికి అలవాటు పడిన రవి భార్యతో గొడవ పడడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన అతను మంగళవారం ఉదయం వెంకటనగరం వెళ్లే దారిలో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడని, ఘటనపై మృతుడి సోదరుడు కబీ భూమిజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ తెలిపారు.

అనంత కాంతులు

గిరి పరిసరాలు.. చిమ్మ చీకట్లో వెలుగు దివ్వెల కాంతికి నూతన శోభను సంతరించుకున్నాయి. దేవ దేవుడైన అనంత పద్మనాభ స్వామి నామస్మరణతో మార్మోగాయి. పోటెత్తిన భక్తులతో అనంత పద్మనాభుని గిరి భక్త జన సాగరంగా మారింది. వేల దీప కాంతులు వెదజల్లిన ఆధ్యాత్మిక సుగంధాలకు భక్తులు పులకాంకితులయ్యారు. ఇది పద్మనాభం గ్రామంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన అనంత పద్మనాభ స్వామి దీపోత్సవ వైభవం.


దీప కాంతులతో అనంతుని గిరి

- దేదీప్య మానంగా అనంతుని దీపోత్సవం
- దీప కాంతిలో ప్రభవించిన పద్మనాభుడు

పద్మనాభం : రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకున్న అనంత పద్మనాభ స్వామి దీపోత్సవం మంగళవారం కనుల పండువగా జరిగింది. తైల దీపాలు వెదజల్లిన సింధూర వర్ణపు కాంతులతో అనంత పద్మనాభుని గిరి దేదీప్య మానంగా వెలుగొందింది. అనంతుని దీపోత్సవ దీప్తి దశ దిశల వ్యాపించి భక్తులకు ఆధ్యాత్మిక పారవశ్యాన్ని కల్పించింది. గిరి శిఖరాన ఉన్న అనంత పద్మనాభుడు, గిరి దిగువన ఉన్న కుంతీ మాధవ స్వామి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం 4 గంటల నుంచే భక్తుల తాకిడి కనిపించింది. మధ్యాహ్నం 3 గంటలకే పద్మనాభం రోడ్లన్నీ భక్తజన సందోహంతో నిండిపోయాయి. ఉత్తరాంధ్ర నుంచే కాకుండా ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీపాలు వెలిగించడానికి భక్తులు పోటీ పడి మరి మెట్లను రిజర్వ్ చేసుకున్నారు. కుంతీ మాధవ స్వామి ఆలయం నుంచి శ్రీదేవి భూదేవి సమేతడైన అనంత పద్మనాభుని ఉత్సవ విగ్రహాలను వేద పండితుల వేద మంత్రోచ్ఛరణలు, నాద స్వర వాయిద్యాల నడుమ గరుడ వాహనంపై తోడ్కొని వచ్చి విశేష పూజలు నిర్వహించారు. గిరిని అధిరోహించే ముందు భక్తులు తొలి పావంచా వద్ద కొలువు దీరిన స్వామిని దర్శించుకున్నారు.


భక్తులతో కిక్కిరిసిన పద్మనాభస్వామి గిరి

సాయంత్రం 5 గంటలకు గిరిపై జేగంట మోగగానే భక్తులు 1,288 మెట్లకు ఇరువైపులా తైల దీపాలను వెలగించారు. తైల దీపాలంకరణతో అనంత పద్మనాభుని గిరికి సింధూర తోరణాలు అద్దినట్టు సుందర దశ్యం ఆవిష్కతమైంది. దీపోత్సవాన్ని కనులారా వీక్షించిన భక్తులు పరవశించిపోయారు. ఈ సందర్భంగా బారి మందుగుండు సామగ్రి కాల్చారు. కోలాటం, తప్పెటిగుళ్ల, పులివేషాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సారి ఘాట్ రోడ్డు ద్వారా కాలినడకన వెళ్లే భక్తులకు గిరిపైన అనంత పద్మనాభ స్వామిని దర్శించుకునే భాగ్యం కల్పించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రథమ పావచంచా వద్ద పూజలు నిర్వహించి దీపం వెలిగించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత తదితరులు పాల్గొన్నారు.


పద్మనాభస్వామి ఊరేగింపు


దీపం వెలిగించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి

నక్కపల్లిలో తుస్సుమన్న లోకేష్ పాదయాత్ర

- కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఎద్దేవా



నక్కపల్లి : టీడీపీ నాయకుడు నారా లోకేష్ నక్కపల్లి మండలంలో నిర్వహించిన పాదయాత్ర తుస్సుమందని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. జనం లేక లోకేష్ పాదయాత్ర వెలవెల బోయిందన్నారు. రాత్రిపూట చీకటి పడ్డాక ఎవరైనా పాదయాత్ర చేస్తారా? అని ప్రశ్నించారు. పాదయాత్ర అంటే నడిచిన ప్రాంతాల్లో సమస్యలు తెలుసుకోవడం, ఆ సమస్యల పరిష్కారానికి తామేం చేస్తామో చెప్పాలన్నారు. పాదయాత్రకు వచ్చిన వారిని పలకరించి, వారి సమస్యలు తెలుసుకోవాలన్నారు. కానీ లోకేష్ మార్నింగ్, ఈవెనింగ్ వాక్ మాదిరిగా పాదయాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గ్రామాల్లో సమస్యలు లేవని, అన్ని వర్గాల వారికి సంక్షేమం అందుతోందని, అందుకే జనం ఎవరూ పాదయాత్ర వైపు కన్నెత్తి చూడలేదన్నారు. పాదయాత్ర పేటెంట్ వై.ఎస్ కుటుంబానిదేనన్నారు. మహానేత వైఎస్సార్ 1600 కిలోమీటర్లు, ఆయన కుమార్తె వై.ఎస్.షర్మిల 2400 కిలోమీటర్లు , వైఎస్సార్ వారసుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 3648 కిలోమీటర్లు పాదయాత్ర చేశారన్నారు. ఆ సమయంలో అన్ని వర్గాల వారితో మమేకమయ్యారన్నారు. వారి సమస్యలు స్వయంగా తెలుసుకోవడం వల్లే నవరత్నాల పథకాలను ప్రకటించారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించని పథకాలను కూడా అమలు చేసి ప్రజలకు మేలు చేకూర్చిన ఘనత జగనన్నదేనన్నారు. పాదయాత్ర ఎందుకు చేశారో చెప్పలేని స్థితిలో లోకేష్, టీడీపీ నాయకులు ఉన్నారన్నారు. టీడీపీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏం నెరవేర్చారో చెప్పే సత్తా ఉందా? అని ప్రశ్నించారు. ఐదేళ్ల టీడీపీ హయాంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే జగనన్న ప్రభుత్వం వచ్చాక నెరవేర్చామన్నారు. హామీల అమలుపై ధైర్యంగా చెప్పుకునే సత్తా జగనన్న ప్రభుత్వానికే ఉందన్నారు.

రెడ్ క్రాస్ సేవలు మరింత విస్తృతం

- జేసీ జాహ్నవి ఆదేశం


రెడ్‌క్రాస్ సేవలపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

తుమ్మపాల: జిల్లాలో రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తృతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా జూనియర్ యూత్ రెడ్ క్రాస్ చైర్మన్‌గా ఆమె మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలల్లో టీంలను ఏర్పాటు చేసి లెక్చరర్లు, టీచర్లను కౌన్సెలర్లుగా నియమించేందుకు డీఈవో, ఆర్‌ఐవో, డీవీఈవోలకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి రక్తసేకరణ కార్యక్రమాలు ముమ్మరం చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్‌ను ఆదేశించారు. బ్లడ్ బ్యాంక్‌ల సేవలపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. రెడ్ క్రాస్ జిల్లా శాఖ ద్వారా నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను చైర్మన్ డాక్టర్ రామ్మూర్తి వివరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ.హేమంత్ జీవితకాల సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ సమావేశంలో రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఏడీ రామజ్యోతి, జిల్లా కోఆర్డినేటర్ ఎం.కోటేశ్వరరావు, రాష్ట్ర మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎస్.వీరన్, వైస్ చైర్మన్ ఎస్.హిమజ, లైఫ్ మెంబర్ డాక్టర్ టి.దేవరాజు, ఏఎంఏఎల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్. మహేశ్వరరావు, ప్రభుత్వ పాలిటెక్నిక్ లెక్చరర్ వై. శ్రీనివాసరావు ఆర్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అనుశెట్టి, ప్రాకార మండపాల నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన

- నూకాంబిక ఆలయ చైర్మన్ మురళీకృష్ణ
- తలనీలాల సేకరణ, రసవర్గాల సరఫరాకు కమిటీ ఆమోదం


కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కొణతాల మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధిలో భాగంగా కొత్తగా అనుశెట్టి మండపం, మూడు గాలి గోపురాలతో కూడిన ప్రాకార మండపాల నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు పిలిచి, ఆమోదించినట్టు ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. స్థానిక దేవస్థానం ఆవరణలో మంగళవారం ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త మండలపాల నిర్మాణపనులకు త్వరలో రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో శంకుస్థాపన జరుగుతుందన్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచి డిసెంబర్ వరకూ అమ్మవారి ఆలయంలో భక్తుల సమర్పించిన తలనీలాలు పొందేందుకు రూ.7.50 లక్షలకు ఏలూరుకి చెందిన తమ్మన శివ, ప్రవీణ్‌లు, అమ్మవారి రసవర్గాలు(పూజా సామగ్రి) సరఫరా చేసే టెండర్‌ను అయ్యప్ప సూపర్ మార్కెట్(అమరావతి) విజ్జపు ఈశ్వరావు దక్కించుకున్నారు. ఈ మేరకు కమిటీ ఆమోదించిందని ఆయన చెప్పారు. అనంతరం సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో అమ్మవారి ఆలయ జమాఖర్చులను పరిశీలించి ఆమోదించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బుద్ద నర్సింగరావు, పీలా లక్ష్మీశ్రీనివాసరావు, ఆడారి ఉమాశ్రీనివాసరావు, కొండూరి రవీంద్రనాథ్, గొల్లవిల్లి నర్సింగరావు, పాము అనురాధ సన్నిబాబు, కంటపల్లి శోభారాణి వెంకటరావు, మల్లవరపు ఈశ్వరరావు, అర్చకుడు యనమండ్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసుల ఆధ్వర్యంలో అన్న సమారాధన


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ దంపతులు

ఆరిలోవ (విశాఖ): కార్తీక మాసం ముగియనున్న సందర్భంగా జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షినగర్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసుల ఆధ్వర్యంలో కైలాస గిరీశ్వరాలయంలో అన్న సంతర్పణ నిర్వహించారు. కార్తీక వన భోజన సమారాధన పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ దంపతులు ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని శివుడికి పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం జరిగిన వన భోజన సమారాధనలో ఎస్పీ దంపతులు పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, రెవెన్యూ కాలనీ, హనుమంతవాక ప్రజలు, ఏఆర్ పోలీస్ కుటుంబాలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించాయి. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, వైఎస్సార్ జిల్లా అదనపు ఎస్పీ ఎ.ఆర్. సత్తిరాజు, రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్లు సతీష్, అరవింద్ కిశోర్, ఆర్.ఎస్.ఐ.లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ గొడవతో సంబంధం లేదు...

- జనసేన నాయకులు తప్పుడు ఆరోపణలు మానుకోవాలి
- ఎంపీపీ రామధర్మజ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామధర్మజ తదితరులు

మాడుగుల : నాలుగు రోజుల నుంచి మాడుగులలో జరుగుతున్న మైనర్ బాలిక గొడవతో తనకు సంబంధం లేదని, తనపై తప్పుడుగా ప్రచారం చేసి కొందరు నాయకులు రాజకీయం పులుముతున్నారని ఎంపీపీ వేమవరపు రామధర్మజ అన్నారు. మంగళవారం మాడుగులలో మైనర్ బాలిక తల్లి, సోదరుడు బంధువులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనర్ బాలికను అల్లరి పెడుతున్నారని బాలిక తల్లి తనకు తెలియజేస్తే అల్లరి పెడుతున్న దిమిలి చిన్న అనే యువకుడిని పిలిచి సున్నితంగా మందలించడం జరిగిందన్నారు. అయితే చిన్నతో పాటు జనసేన నాయకుడు కృష్ణ, మరికొందరు తనపై తప్పుడు ఆరోపణలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన నాయకుడు కృష్ణ ఒకరిని విమర్శించే ముందు తాను గతంలో చేసిన తప్పులు ఒకసారి గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. స్థానికంగా జరిగింది తెలుసుకోకుండా ఎవరో ఏదో చెబితే పంచకర్ల రమేష్‌బాబు కూడా తనపై ఆరోపణలు చేయడం తగదన్నారు. నీతి నిజాయితీకి, క్రమశిక్షణకు మారుపేరుగా కొనసాగుతున్న మా నాయకుడు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అడుగు జాడల్లో నడుస్తున్నామని అన్నారు. ఒక మైనర్ బాలికను ఇబ్బంది పెట్టరాదని గ్రామ శ్రేయోభిలాషిగా సున్నితంగా మందలిస్తే దానిని రాజకీయం చేసి రచ్చకెక్కించడం జనసేన నాయకులు మానుకోవాలన్నారు. మంచి జరగాలని కోరుకుంటే ప్రస్తుతం గ్రామంలో యువత చెడువైపు మళ్లకుండా అఖిలపక్ష నాయకులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. బాలిక తల్లి మాట్లాడుతూ చిన్న అనే యువకుడు తన కుమార్తెను, కొంత కాలంగా ఇబ్బంది పెడుతున్నాడని, ఈ నెల 3వ తేదీ రాత్రి ఇంటి వద్దే బాగా అల్లరి పెట్టడంతో భయపడి ఈ విషయాన్ని ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఎంపీపీ చెప్పిన మాట కూడా వినకపోతే పోలీసులకు ఫిర్యాదు చేశానని, ఈ విషయంలో ఎంపీపీకి సంబంధం లేదని, తమ కుటుంబాన్ని వీధిలోకి లాగి పరువు తీయరాదని ఆమె కంటి తడిపెట్టారు. వైస్ ఎంపీపీ రాజారామ్ మాట్లాడుతూ పట్టణంలో అన్ని పార్టీల నాయకులు కలసి సమావేశం ఏర్పాటు చేసుకుని, మరలా ఇలాంటి అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ కళావతి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, రెండో వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ జిమ్నాస్టిక్స్ పోటీలకు కేజే పురం విద్యార్థులు


జిమ్నాస్టిక్స్ పోటీలకు ఎంపికైన మురళి, నీరజలను అభినందిస్తున్న హెచ్‌ఎం దాసు, స్కూలు కమిటీ చైర్మన్ కిశోర్

మాడుగుల రూరల్: జాతీయ జిమ్నాస్టిక్స్ పోటీలకు మండలంలోని కె.జె.పురం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. గత నెల 4వ తేదీన కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు గొడు మురళీ, పులిగా నీరజ ప్రథమ స్థానంలో నిలిచారు. వీరు ఈ నెల 16వ తేదీ నుంచి ఢిల్లీలో జరిగే జాతీయ జిమ్నాస్టిక్స్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల హెచ్‌ఎం వి.దాసు మంగళవారం తెలిపారు. ఇరువురు విద్యార్థులను హెచ్‌ఎం దాసు, పాఠశాల కమిటీ చైర్మన్ మళ్ల కిశోర్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కశిరెడ్డి ప్రసాదు తదితరులు అభినందించారు.

రూ.12 లక్షలతో తాండవ గేట్ల మరమ్మతులకు ప్రతిపాదనలు


తాండవ ప్రాజెక్టు ప్రధాన గేట్లు లీకేజీ

నాతవరం : తాండవ రిజర్వాయరు ప్రధాన గేట్లు లీకేజీ మరమ్మతు పనులు నిపుణులతో చేపట్టడానికి ప్రణాళిక సిద్ధం చేశామని తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ అన్నారు. ఆమె మంగళవారం తాండవ ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టులో నీటి మట్టాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాండవ ప్రాజెక్టు ప్రధాన గేట్లు లీకేజీ పనుల కోసం రూ.12 లక్షలు నిధులకు ప్రతిపాదనలు చేశామన్నారు. లీకేజీ పనులు చేసేందుకు రాష్ట్రంలో అనుభవం ఉన్న మెకానికల్ ఇంజినీర్ల దృష్టికి తీసుకువెళతామన్నారు. తుపానుకు ముందు తాండవ ప్రాజెక్టులో 345 అడుగులు నీటి మట్టం ఉండేదని, తుపాను వల్ల ఇన్‌ఫ్లో ప్రాజెక్టులోకి ఆరు అడుగులు మాత్రమే పెరిగిందన్నారు. కార్యక్రమంలో తాండవ నాతవరం సెక్షను జేఈలు రామకృష్ణ, శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

డైట్ మ్యాగజైన్‌ను ఆవిష్కరించిన మిజోరాం గవర్నర్


డైట్ కళాశాల మ్యాగజైన్‌ను ప్రారంభించిన మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు

అనకాపల్లిటౌన్: స్థానిక డైట్ కళాశాల మ్యాగజైన్‌ను మిజోరాం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు విశాఖలోని తన స్వగృహంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల వార్షిక మ్యాగజైన్ విద్యార్థులు, అధ్యాపకుల విద్యా కార్యకలాపాలు, విజయాలను రికార్డ్ చేయడానికి దోహదపడుతుందన్నారు. కవితలు, పెయింటింగ్‌లు, కథలు రాయడంలో విద్యార్థుల సృజనకు ఈ మ్యాగజైన్ అద్దం పడుతుందన్నారు. వార్షిక మ్యాగజైన్‌లను విడుదల చేసే ఆచారాన్ని కొనసాగించినందుకు డైట్ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌బీ శ్రీరామ్‌కు ‘గొల్లపూడి’ పురస్కారం ప్రదానం


నటుడు ఎల్‌బీ శ్రీరామ్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న దాడి వీరభద్రరావు, తదితరులు

సీతంపేట: తెలుగు సాహిత్యంలో గొల్లపూడి మారుతీరావు మరో ఆణిముత్యమని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. నవసాహితీ ఇంటర్నేషనల్(చెన్నై) ప్రవేశపెట్టిన గొల్లపూడి స్మారక పురస్కారాన్ని ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ నటుడు ఎల్‌బీ శ్రీరామ్‌కు ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దాడి మాట్లాడుతూ కథకుడిగా, నాటక కర్తగా, నటుడిగా, 25 ఏళ్ల పాటు ఓ పత్రికలో జీవనకాలమ్ నడిపిన పాత్రికేయుడిగా గొల్లపూడి ప్రదర్శించిన ప్రతిభా పాటవాలు అభినందనీయమని కొనియాడారు. పురస్కార గ్రహీత ఎల్‌బీ శ్రీరామ్ మాట్లాడుతూ గొల్లపూడితో తనకున్న అనుబంధాన్ని, రంగస్థలం, సినిమా నటుడిగా ఉన్న సంబంధాన్ని చమత్కారంగా హాస్యోక్తులతో వివరించారు. సురభి పత్రికలో మారుతీరావుపై తాను రాసిన వ్యాసాన్ని ఆయన చదివి వినిపించారు. ముందుగా గొల్లపూడి, ఎల్‌బీ శ్రీరామ్ నటించిన పల్లకి లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఆచార్య వెలమల సిమ్మన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సినీ నటుడు మిశ్రో, నవసాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.వి.సూర్యప్రకాశరావు, మేడా మస్తాన్‌రెడ్డి, ఏపీ మా అధ్యక్షుడు దాడి సత్యనారాయణ, స్మార్ట్ ఇన్ అధినేత బాబ్జి, డి.వి.సూర్యారావు, గొల్లపూడి రామకృష్ణ, నవ సాహితీ కార్యదర్శి డాక్టర్ గోపీచంద్, సభ్యులు యడవల్లి సుధాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'వై ఏపీ నీడ్స్ జగన్' నేడు

అనకాపల్లిటౌన్: మండలంలోని తగరంపూడి సచివాలయం పరిధిలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద్‌లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ లబ్ధి వివరాల డిస్‌ప్లేబోర్డు, ప్రధాన కూడలిలో పార్టీ జెండా ఆవిష్కరణ చేయనున్నట్లు చెప్పారు. మండలపరిధిలో సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వలంటీర్లు హాజరుకావాల్సిందిగా కోరారు.

నేడు గౌరమ్మ నిమజ్జనోత్సవం



కశింకోట: స్థానిక గవరపేట రామాలయంలో నెలకొల్పిన ఆది గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) నిమజ్జనోత్సవం బుధవారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బీశెట్టి దుర్గానాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. కార్తీక మాసం పురస్కరించుకుని నెల రోజుల క్రితం గౌరమ్మ విగ్రహాన్ని నెలకొల్పామన్నారు. కార్తీక మాస పూజలు ముగియడంతో గ్రామ వీధుల్లో సంప్రదాయంగా ఊరేగించి స్థానిక శారదానదిలో నిమజ్జనం చేయనున్నట్లు పేర్కొన్నారు.

అన్న సమారాధన నేడు



ప్రత్యేక అలంకరణలో భోగలింగేశ్వరస్వామి

అనకాపల్లిటౌన్: గవరపాలెం కోటవీధి శ్రీభోగలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా నెలరోజులపాటు భోగలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు జరిపినట్లు పేర్కొన్నారు. బుధవారం పోలిస్వర్గం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, అన్నసమారాధన జరపనున్నట్లు వెల్లడించారు.

సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీల ధర్నా



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కశింకోట: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కశింకోటలో మంగళవారం ఆందోళనబాట పట్టారు. వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, ఇతర సదుపాయాలు కల్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక జాతీయ రహదారి వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం ప్రతినిధులు కాసులమ్మ, తనూజ, ఐద్వా జిల్లా నాయకురాలు డీడీ వరలక్ష్మి, సీపీఎం ప్రధాన కార్యదర్శి లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

8 మందికి ఐవోఎల్ శస్త్ర చికిత్సలు



మందులు అందిస్తున్న రవిరాం జవహర్


అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం ఉచితంగా 8 మందికి ఐవోఎల్ శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆస్పత్రి చైర్మన్ రవిరాం జవహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఆస్పత్రి ఆవరణలో 36 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 8 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ చేయించుకున్న రోగులకు ఐదురోజులు ఆస్పత్రిలో వసతితోపాటు, సరిపడా మందులు, ఆహారం ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సహాయకురాలు పి.దేవి, రోగులు పాల్గొన్నారు.





శ్రద్ధగా పాఠాలు వింటున్న విద్యార్థులు

జగనన్న అమ్మఒడి.. చదువుల్లో సరికొత్త ఒరవడి





నా పేరు కొల్లిమల్ల సూర్యకుమారి. కిరాణా దుకాణంలో పనిచేస్తున్నాను. నాకు ఒక్కగానొక్క పాప వర్షిణి. మాది చింతనిప్పల అగ్రహారం. నాకు పెళ్లైన కొన్నేళ్లకే భర్త మరణించడంతో రేబాకలోని మా కన్నవారింటికి వచ్చి, అమ్మతో కలిసే ఉంటున్నాం. పాపను మొదట్లో పట్టణంలోని ప్రైవేటు స్కూళ్లో చదివించేవాళ్లం. కొన్నాళ్లకు మా నాన్న కూడా మరణించడంతో మా బతుకులు రోడ్డున పడ్డాయి. దీంతో పాపను రేబాకలోని గవర్నమెంట్ స్కూల్లో చేర్పించా. ఇపుడు పాప ఐదో క్లాస్ చదువుతోంది. జగనన్న ప్రభుత్వం ఏటా అమ్మఒడి రూ.15 వేలు ఇస్తోంది. నాతో పాటు మా అమ్మకు వితంతు పింఛను వస్తోంది. ఇంటి స్థలం ఇచ్చారు. అమ్మకు కాపు నేస్తం అందుతోంది. నా బిడ్డకు ఓ మేనమామలా జగనన్నే పుస్తకాలు, యూనిఫాం.. అన్నీ అందిస్తున్నారు. జగనన్న ఉన్నంత వరకు మా పాప చదువుపై నాకు ఎలాంటి భయం లేదు.



ఈమె పేరు సేనాపతి జయలక్ష్మి. మండలంలోని రేబాక గ్రామం. భర్త కూలి పనులకు వెళ్తే వచ్చే ఆదాయమే ఈ కుటుంబానికి భరోసా. వీరికి ముగ్గురు పిల్లలు(హేమంత్, నరేంద్ర, కార్తీక్). ముగ్గురూ రేబాక ఎంపీయూపీ స్కూల్లోనే చదువుతున్నారు. ముగ్గురు పిల్లల్ని చదివించలేమనే భయం మొదట్లో వీరిని వేదించేది. నవరత్నాల్లో అమ్మఒడి పథకం మొదటి ఏడాది పెద్ద కొడుకు హేమంత్‌కు వచ్చింది. ఇపుడు రెండో తరగతి చదువుతున్న మూడో కొడుకు కార్తీక్‌కు అమ్మఒడి అందుతోంది. పిల్లల యూనిఫాం, షూ, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అన్నీ స్కూల్లోనే ఇస్తున్నారు. పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసి, వసతులు మెరుగవడంతో ఆనందంగా స్కూల్‌కు పంపిస్తున్నట్లు జయలక్ష్మి చెప్పున్నారు. మధ్యాహ్న భోజనంలో అందిస్తున్న జగనన్న గోరుముద్ద తమ ఇంటి భోజనం కంటే బాగుందని కితాబిస్తున్నారు.

తుమ్మపాల: నవరత్నాల్లో అత్యంత ప్రతిష్టాత్మక పథకం జగనన్న అమ్మఒడి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ పేద విద్యార్థీ చదువుకు దూరం కారాదన్న మహా సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో చదువుకునే ప్రతి విద్యార్థి తల్లిని లబ్ధిదారుగా చేస్తూ ప్రభుత్వం ఏటా రూ.15 వేలు చొప్పున వారి బ్యాంక్ ఖతాల్లో జమ చేస్తోంది. రాష్ట్రంలో 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు ఈ పథకాన్ని అమలుచేస్తూ ఏటా నగదు చెల్లిస్తోంది.

అమ్మఒడి అర్హతలు

- ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని ఏటా జూన్ నెలలో అమలు చేస్తుంది.
- విద్యార్థులు కనీసం 75 శాతం హాజరుతో రెగ్యులర్‌గా తరగతులకు వెళ్లాలి.
- విద్యార్థి పేరెంట్స్‌కు తెల్ల రేషన్ కార్డు ఉండాలి.
- తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి ప్రభుత్వ, ప్రైవేట్/కార్పొరేట్ కళాశాలల్లో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే పిల్లలకు అమ్మఒడి పథకం వర్తిస్తుంది.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- యలమంచిలి డీవైఈవో అప్పారావు
- లంకెలపాలెం హైస్కూల్ సందర్శన



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈవో అప్పారావు

అగనంపూడి: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు అన్నారు. ఈ అంశంలో పాఠశాలల సిబ్బంది శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. రక్తహీనతతో బాధపడుతున్న బాలల వివరాలు అడిగి, వారికి ప్రభుత్వం అందిస్తున్న మందులు విధిగా తీసుకునేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. తరువాత రాగిమాల్ట్ రుచి చూశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడిన ఆయన ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న దాడి రత్నాకర్ దంపతులు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం సంతబయలు పెద్దరామస్వామి దేవాలయంలో సోమవారం రాత్రి శివపార్వతుల కల్యాణం వేడుకగా జరిగింది. కల్యాణ మహోత్సవంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అల్పాహారం అందించారు. కల్యాణంలో పాల్గొన్న మహిళా భక్తులకు రత్నాకర్ దంపతులు జాకెట్ ముక్కలు, పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు.

నేటి నుంచి మార్గశిర మాసోత్సవాలు



కశింకోటలోని కనకమహాలక్ష్మి అమ్మవారు



కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం

కశింకోట: స్థానికంగా ప్రసిద్ధి చెందిన కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు పూర్తిచేశారు. ఏటా ఇక్కడ మార్గశిర మాసోత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ప్రధానంగా ఈ మాసంలో వచ్చే గురువారం రోజుల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగో గురువారం భారీ అన్న సమారాధన, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి కుమార్ మంగళవారం తెలిపారు.

వేడుకగా అంబలం పూజ



అంబలం పూజ నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం శ్రీ వినాయక గౌరీసేవా సమితి, శ్రీ పీలా గౌరీ పరమేశ్వరుల మహోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి అయ్యప్ప స్వామి అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. సేవాసమితి శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహానూకరాజు, ఆలయ గౌరవాధ్యక్షుడు కొణతాల రఘునాథ్‌లు ప్రత్యేక పూజలు చేశారు. 18 పడిమెట్లను ఏర్పాటుచేసి అయ్యప్పస్వామికి దీపారాధన, హారతి ఇచ్చారు. పూజలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించి, రాత్రి అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ద బల్లమ్మనాయుడు, కోశాధికారి భీమరశెట్టి లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

డ్రైనేజీలో పూడిక తొలగింపు

అనకాపల్లిటౌన్: జీవీఎంపీ పరిధిలో దశలవారీగా ప్రధాన డ్రైనేజీతో పాటు, వీధి కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేయనున్నట్లు జెడ్సీ సుర వెంకటరమణ తెలిపారు. స్థానిక మెయిన్‌రోడ్డు బండిగాడ వీధి డ్రైనేజీలో పూడికతీత పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్న సమయంలో డ్రైనేజీలో నీరు రహదారులపై ప్రవహించకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఎక్కడైనా డ్రైనేజీ సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.



పొక్లెయిన్ సాయంతో డ్రైనేజీలో పూడిక తొలగింపు పనులు

హైవే బ్రిడ్జి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

అనకాపల్లిటౌన్: మండలంలోని జాతీయ రహదారిలోని కొప్పాక ఏలేరు కాలువ బ్రిడ్జిపై మరమ్మతు పనుల్ని త్వరితగతిన చేపట్టాల్సిందిగా జీవీఎంసీ అధికారులను సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. మిచాంగ్ తుపాను కారణంగా బ్రిడ్జిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. దీంతో గాజువాక నుంచి అనకాపల్లి వచ్చే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాత్రి సమయంలో బ్రిడ్జి సమీపంలో విద్యుత్ లైట్లు లేకపోవడంతో ఆ గోతుల్లోపడి ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు.



ఏలేరు కాలువ జాతీయ రహదారి బ్రిడ్జిపై గోతులు

సిద్ధమైన ఆయుర్వేదిక్ ఆస్పత్రి భవనం



అందంగా ముస్తాబైన కన్నూరుపాలెం ఆయుర్వేదిక్ ఆస్పత్రి భవనం

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి భవనం నూతన సొబగులు సంతరించుకుంది. జిల్లాలో మూడు ఆయుర్వేదిక్ ఆస్పత్రులను అభివృద్ధి చేయడంలో భాగంగా ఈ ఆస్పత్రికి ఆయుష్మాన్ భారత్ నిధులు రూ.3.90 లక్షలు మంజూరు చేశారు. దీంతో ఆస్పత్రి భవనానికి అందంగా రంగులు వేసి, ఫుట్ పాత్ నిర్మించారు. భవనం లోపల అవసరమైన పనులు చేపట్టారు. ఆస్పత్రి వైద్యాధికారి కె.లావణ్య పర్యవేక్షణలో నిర్మాణ పనులు పూర్తి చేశారు.

మళ్లీ సీఎంగా జగన్‌నే గెలిపిద్దాం



అభివృద్ధి, సంక్షేమ లబ్ధి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దిలీప్‌కుమార్, సూరిబాబు తదితరులు

- 'వై ఏపీ నీడ్స్ జగన్'లో వైఎస్సార్‌సీపీ నేతలు

అనకాపల్లిటౌన్: రాష్ట్రంలో అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆయా రాష్ట్రాల్లో అమలు చేయడం మన రాష్ట్రానికి గర్వకారణమని ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలోని సత్యనారాయణపురం-2 సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో ప్రభుత్వ సేవలు పట్టణానికే పరిమితమయ్యాయని, తమ ప్రభుత్వంలో గ్రామ సచివాయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు తదితర ఏర్పాట్లతో గ్రామస్వరాజ్యం సిద్ధించిందన్నారు. సకాలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్ధిదారుల చెంతకే చేరుస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకునే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అంతకుముందు సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ వివరాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో అర్హులైన వారికి రూ.16.49 కోట్ల మేరకు సంక్షేమ లబ్ధి కలిగిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల బ్రోచర్లను స్థానికులకు అందించారు. ప్రధాన కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, పల్లెనిద్ర చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఈవోఆర్డీ ధర్మారావు, మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద్, సర్పంచ్ పలకా భాగ్యలక్ష్మి సత్తిబాబు, వైస్ ఎంపీపీ విల్లూరి చంద్రశేఖర్, ఎంపీటీసీలు జోగా నాగమణి నాగేశ్వరరావు, కర్రి అలివేణి మల్లేశ్వరరావు, ఉప సర్పంచ్ భవానీ అప్పలరాజు, సచివాలయం ఉద్యోగులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎర్ర బ్యాడ్జీలతో ఆర్టీసీ కార్మికుల నిరసన



డిపో గేటు వద్ద నిరసనలో మాట్లాడుతున్న అసోసియేషన్ రీజినల్ కార్యదర్శి సుధాకర్

అనకాపల్లిటౌన్: ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ) నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి మంగళవారం విధులకు హాజరయ్యారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో స్థానిక డిపో వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రీజినల్ కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ ఈపీఎఫ్ 95, సీపీఎస్‌పై ఆప్షన్ నిలుపుదల చేసి, ఉద్యోగి తనకు అవకాశమున్నపుడు ఆప్షన్ ఇచ్చుకునేందుకు వెసులుబాటు కల్పించాలని, ఆర్‌పీఎస్ 2017 బకాయిల్ని ఉద్యోగులందరికీ ఒకేసారి చెల్లించి, ఈపీఎఫ్ 95కు చెల్లింపు చేసుకుని హయ్యర్ పెన్షన్ పొందేలా ఏర్పాటు, ఈహెచ్ఎస్ స్థానంలో ఇదివరకే ఉన్న పరిమితిలేని వైద్యాన్ని కొనసాగించాలని, వివిధ కారణాలతో రిటైర్ అయిన, సంస్థ నుంచి తొలగించి ఉద్యోగులదరికీ సెటిల్మెంట్ జాప్యం నివారణ తదితర అంశాలను తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ డిపో అధ్యక్షుడు ఏఎస్ రావు సహాయ కార్యదర్శి ఎంఎస్ నాయుడు, ఎంపీఎస్‌కేపీ వర్మ, ఉద్యోగులు పాల్గొన్నారు.

చురుగ్గా ఔటర్ డ్రైనేజీ నిర్మాణ పనులు



హైవే పక్కన నిర్వహిస్తున్న ఔటర్ డ్రైనేజీ పనులు

కశింకోట: స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఔటర్ డ్రైనేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వర్షం వస్తే జాతీయ రహదారిపై వరద నీరు ప్రవహిస్తోంది. ఆ నీరు స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చేరి రోజులతరబడి నిలిచిపోయి ప్రజలకు, అధికారులకు ఇబ్బంది కలిగిస్తోంది. ప్రస్తుతం ఉన్న కాలువ నుంచి నీరు సరిగ్గా ప్రవహించకపోవడం వల్లే ఈ దుస్థితి. దీంతో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతిల చొరవతో ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో ఔటర్ డ్రైనేజీ నిర్మాణాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంతంలో రోడ్డుకు రెండు వైపులా నీరు పోయేలా సిమెంట్ పైపులు, మిగిలిన భాగంలో కాంక్రీట్ కాలువను నిర్మిస్తున్నారు. పనులను పర్యవేక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు మాట్లాడుతూ త్వరలోనే డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తిచేసి, నిల్వనీటి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

ఘనంగా శూలాల మహోత్సవం



చౌడేశ్వరి సాంబశివుడు



ఐస్‌తో తయారు చేసిన శివలింగం





శూలాలు ధరించిన శివభక్తులు

అనకాపల్లిటౌన్: స్థానిక చిన్నరాజుపేట చౌడేశ్వరి సాంబశివ దేవాలయంలో సోమవారం రాత్రి శూలాల మహోత్సవం ఘనంగా జరిగింది. కార్తీక సోమవారం పురస్కరించుకుని 30 మంది శివభక్తులు ఉపవాసం ఉండి, శూలాలు ధరించి శివతాండవం చేస్తూ, భక్తిని చాటుకున్నారు. కాళీమాత వేషధారణ, పులివేషాలు, సినీ డూప్ డ్యాన్స్ స్టేజ్‌ప్రోగ్రాంలను ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. శూలాల మహోత్సవం అనాదిగా దేవాంగ కులస్తుల ఆచారమని పట్టణ చౌడేశ్వరీ దేవాంగ సంక్షేమ సంఘం సహాయ కార్యదర్శి బల్లా నాగభూషణం చెప్పారు. శూలాల మహోత్సవంలో ఐస్‌తో చేసిన శివలింగం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాసిన బాల, మావూరి అయ్యప్ప, వేమన సంతోష్, రెడ్డి వరప్రసాద్, మానెం సతీష్, వెంకటేష్, సూర్యనారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు నందు, భక్తులు పాల్గొన్నారు.

పక్కాగా పంటకోత ప్రయోగాలు

సబ్బవరం: పంట కోత ప్రయోగాలే దిగుబడుల లెక్కింపునకు ప్రామాణికమని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రామారావు అన్నారు. మండలంలోని అసకపల్లిలో వరి పంట కోత ప్రయోగాలు చేసే విధానాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. మండలంలో 42 వరి పంట కోత ప్రయోగాలు లక్ష్యం కాగా ఇప్పటికే 18 ప్రయోగాలు పూర్తి చేశారన్నారు. పంట కోత ప్రయోగాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏడీ చంద్రశేఖర్ వర్మ, ఉప గణాంకాధికారి రాజేశ్వరరావు, శ్రీనివాసరావు, ఏఎస్‌వో రమాదేవి, గ్రామ వ్యవసాయ సహాయకులు అలేఖ్య పాల్గొన్నారు.